
# వామ్మో అవార్డు..!




ట్రింగ్ ట్రింగ్.... ట్రింగ్ ట్రింగ్... ఫోన్ మోగింది.

రాత్రి పన్నెండు గంటలు కావస్తోంది. ఇంత రాత్రివేళ తనకి ఫోన్ చేసేవారెవరబ్బా అని ఆలోచనలో పడ్డాను నేను. ఎందుకంటే ఆ సమయంలో ఫోన్ ఎవరూ చేయరు నాకు. బహుశా ఏదైనా అత్యవసర సమాచారం అయ్యి వుంటుంది. అదీ కాక ఆ ఫోన్ రింగ్ అయినదాన్ని బట్టి చూస్తే అది దూరం నుండి వచ్చే ఎస్టీడీ ఫోన్‌కాల్‌లా రింగవుతోంది. ఆ శబ్దానికి నాకు కాస్త భయమేసింది. మా ముఖ్యమైన బంధువులందరూ దూర ప్రాంతాలలోనే ఉన్నారు. వాళ్ళలో ఎవరి ఆరోగ్యం ఎలా వుందోనని కంగారుతో ఫోన్ రిసీవర్ ఎత్తాను.

"హలో...!" అవతల నుండి నా సాహితీ మిత్రుడు రామ్ కంఠం. "హలో రామ్! క్షేమమా?" అన్నాను కంగారుగా. ఎందుకంటే ఆయన గత వారమే మా ఊరొచ్చి వెళ్ళాడు. ఇప్పట్లో ఆయన నాకు ఫోన్ చేసే అవసరమే లేదు మరి.

"ఆ... క్షేమమే" అన్నారు రామ్ కూల్‌గా.

"చెప్పండి..." మరి ఎందుకు చేసినట్లు అన్న ధోరణిలో అడిగాను కంగారుగా.

"మరేం లేదు. మొన్న మీ ఊర్లో జరిగిన మీటింగ్ స్టేజ్ మీద ఒక ప్రకటన చేద్దామను కుంటున్నామని చెప్పాం కదా. కాని ఆ స్టేజీమీద ప్రకటించడానికి అవకాశం లేక ప్రకటించలేదు. ఆ విషయం ఇప్పుడు మీకు చెప్దామని..."

"ఏమిటది? చెప్పండి" అడిగాను మరింత టెన్షన్‌గా. "మరేం లేదు. మా 'రమ్యభారతి' సంస్థ ద్వారా సాహితీరంగంలో విశేషంగా, నిస్వార్థంగా కృషిచేస్తున్న ఉత్తమ యువసాహితీ వేత్తకు ప్రతి ఏటా 'రమ్యభారతి' పురస్కారాన్నిచ్చి సత్కరించాలని అనుకుంటున్నాము. ప్రప్రథమంగా ఈ అవార్డును ఈ సంవత్సరంతో ప్రారంభించి తొలి అవార్డు మీకు ఇవ్వాలని నిర్ణయించాము" చెప్పాడు రామ్.

"....... ?" నాకు ఆశ్చర్యంతో నోటమాట రాలేదు.

"హలో... హలో... వెంకటేష్ గారూ! మీ నుండి సమాధానం రాకపోయేసరికి లైన్ కట్ అయిందేమోనని" కంగారుగా అరిచారు రామ్.

"ఆ... " అని అన్నాను ఆశ్చర్యం నుండి తేరుకుంటూ.

"ఏమిటండీ! అలా నిశ్శబ్దంగా ఉండిపోయారు? మా పురస్కారం అందుకోవడం మీకు ఇష్టంలేదా?" అడిగారు రామ్.

"అబ్బే! అదేం లేదండీ. కాకపోతే నాకంటే ఎంతో సాహితీ సేవ చేసేవాళ్ళు ఈ రాష్ట్రంలో ఎంతోమంది వున్నారు. అలాంటివారికి మీరు ఈ అవార్డునిస్తే బాగుంటుంది కదా!" చెప్పాను నేను.

"మీరు చెప్పింది రైటే. కాకపోతే మీలాగ నిస్వార్థంగా సాహితీ సేవ చేసినవాళ్ళు మాకెవ్వరూ కనిపించలేదు. అందుకే మా సంస్థ సభ్యులు మీ పేరునే నిర్ణయించారు' చెప్పారు రామ్.

నిస్వార్థం అనగానే రామ్ గతవారం మా ఊర్లోకొచ్చినప్పటి సంఘటనలు గుర్తుకు వచ్చాయి నాకు. రామ్ రచించిన పుస్తకాలకు మీ ఊర్లో ఆవిష్కరణ సభ పెట్టమంటే, మా యువసాహితీ సంస్థ సభ్యులను సంప్రదించి ఆ సభను ఏర్పాటు చేసాను నేను. ఆ పుస్తక

ఆవిష్కరణ సభ ద్వారా రామ్ పుస్తకాలకు మంచి పబ్లిసిటీ వచ్చింది మా ఊర్లో. అదే విషయాన్ని ఆయన నాకు చెబుతూ తన ఊరు వెళ్ళే ముందు నాకు కొంత డబ్బు ఇవ్వబోయారు రామ్. దాన్ని నేను తిరస్కరించాను. డబ్బు కోసం, పబ్లిసిటీ కోసం ఈ సభను మేము చెయ్యలేదని, కేవలం పది మందికి ఉపయోగపడే సాహితీ కార్యక్రమాలు చేపట్టాలనే సదుద్దేశంతోనే ఈ కార్యక్రమాలు చేస్తున్నామన్నాను. డబ్బే మాకు ప్రధానమనుకుంటే ఏ కష్టం పడకుండా మేము చేసుకుంటున్న వృత్తులలోనే సంపాదించుకోగలమని చెప్పాను. దానికి ఎంతో మెచ్చుకుని ఆనందంగా వెళ్ళిపోయారు రామ్. దానికి కృతజ్ఞతగా తనకు ఇప్పుడీ పురస్కారం ఇవ్వనున్నారా? అని అనిపించి అదే విషయాన్ని ఆయన్ని అడిగాను నేను ఫోనులో.

"అబ్బే! అదేం కారణం కాదు. కాని గతంలో మీరు మా ఊర్లో రచయితల పుస్తకాలపై పత్రికలలో ఎంతో బాగా సమీక్ష చేశారు. మీరు ఎన్నో రచనలు పుస్తకాలుగా తీసుకువచ్చారు. ఇంత చిన్న వయస్సులోనే మీరు సాహితీరంగంలో ఇన్ని మంచి కార్యక్రమాలు నిస్వార్థంగా చేస్తున్నందుకు మా సంస్థ చేసే చిరు సత్కారమే ఇది. దయచేసి కాదనకండి" అభిమానం ధ్వనించే కంఠంతో అడిగారు రామ్.

"అవుననటం, కాదనటం మాట అలా వుంచండి. మొన్న నేను మీ పుస్తకావిష్కరణ సభ మా ఊర్లో పెట్టినందుకే మీరు కృతజ్ఞతగా నాకీ సత్కారం చేసారనుకుంటారు మా ఊర్లోవాళ్ళు. అది నాకిష్టం లేదు. ఆ సభ చేసినందుకే మీరీ సత్కారం చేస్తే అది మా సంస్థ సభ్యులందరికీ వర్తిస్తుంది. కనుక మా సంస్థలోని వేరే ఎవరికైనా చేయండి" అని అన్నాను నేను.


"వాళ్ళు ఎవరో, వారి మనస్తత్వాలేంటో మాకు తెలీదు. అదీ కాక గత సభలో మేము మీకు డబ్బులిస్తుంటే వద్దని తిరస్కరించారు. అదే వేరే వారైతే పక్కవాడికి కూడా తెలియకుండా జేబులో పెట్టేసుకుంటారు. ఇక మీరు ఆ సంగతే మర్చిపోండి. మీరు చేస్తున్న రచనలకి, సాహితీసేవకు ఈ పురస్కారం ఇస్తున్నామని అనుకోండి" చెప్పారు రామ్ ముక్తాయింపుగా.

ఇంతసేపు ఫోనులో మాట్లాడుతున్న మా మాటలు విని మా నాన్నగారు "ఏమిటంటూ" నా గదిలోకి వచ్చి అడిగారు. విషయం చెప్పాను. "దానికి ఇంతసేపు వాదించుకోవడం దేనికీ? ఆయనే చెబుతున్నారు కదా నీ సాహిత్య కృషిని మెచ్చి ఇస్తున్నామని. ఎవరో ఏదో అనుకుంటారని దానికి నువ్వు కాదనాల్సిన పని లేదు. డబ్బులు ఎదురిచ్చి సన్మానాలు చేయించుకుంటున్న ఈ రోజుల్లో వాళ్ళకి వాళ్ళే ముందుకొచ్చి పురస్కారం ఇస్తామంటే కాదంటావేంటి? అలాగంటే వారిని కించపర్చినట్టే అవుతుంది. ఒప్పేసుకో" అని అన్నారు. ఆ సమయంలో నాకు ధైర్యం చెప్పిన మా నాన్నగారి మాటలు నాకు నచ్చాయి. "సరే"నని చెప్పాను రామ్‌తో. ఆయన చాలా ఆనందించారు. కార్యక్రమం ఎప్పుడో, వక్తలు ఎవరెవరో తదితర వివరాల ఆహ్వాన పత్రాలు త్వరలోనే పంపిస్తానని చెప్పారాయన.

ఫోన్ పెట్టేసిన నాకు మా నాన్నగారు చెప్పిన మాటలే గుర్తుకు వస్తున్నాయ్. నిజమే డబ్బులు ఎదురిచ్చి అవార్డులు, సన్మానాలు ఎంతమంది తన కళ్ళముందు పొందలేదు?! ఏ విధమైన సాహిత్య ప్రతిభ లేని అటువంటివారు సన్మానాలు పొందటం వెనక ఎవరెవరు ఎలా కామెంట్ చేస్తున్నదీ తనూ విన్నాడు. కాని తాను అలాంటివాడు కాదే. వారికి వారే ఎటువంటి డబ్బులు ఆశించకుండా పురస్కారమిస్తానంటే కాదనటం ఎంతవరకు సబబు. అవును ఎవరేమనుకుంటే నాకేం? నేనేం తప్పు చెయ్యలేదని నా మనస్సాక్షికి తెలుసు. ఎవరెన్ని కామెంట్స్ చేసుకున్నా తనకనవసరం అని గట్టిగా మనసులో నిర్ణయించుకుని పురస్కార సభకి సంబంధించిన ఊహలలోకి వెళ్ళిపోయి ఆనందించాను. ఈ సందర్భంగా గతంలో నా స్నేహితుడి మిత్రుడు అన్న మాటలు నాకు గుర్తుకు వచ్చాయి. నా స్నేహితుడు రాజ్ తనకు తెల్సిన ఓ జ్యోతిష్య మిత్రుడిని నాకు పరిచయం చేశాడు. నన్నూ, నా చేతినీ చూసిన ఆ జ్యోతిష్య మిత్రుడు "మీరు తాళ్ళపాక అన్నమాచార్య అంతటి గొప్పవారవుతారు" అని అన్నాడు. "నాకు అంత సీన్ లేదులెండి" అన్నాను నేను నవ్వేస్తూ. ఎందుకంటే నాకు జ్యోతిష్యాల మీద నమ్మకం ఏ మాత్రం లేదు. ఇలాంటి వారి మాటల్లో పడి ఎంతమంది మోసపోయిందీ నా కనులతో చూశాను మరి. అలాంటప్పుడు ఆ మాటలు ఎలా నమ్మను? కాని అనుకోని విధంగా ఈ సాహితీ పురస్కారం తమకు తాము నా దగ్గరికొచ్చి ఇస్తానని అంటుంటే ఆ జ్యోతిష్యుడి మాటలు నిజం కాబోతున్నాయా అని మనసులో తల్చుకుని మురిసిపోయాను.

ఓ నాలుగు రోజులు గడిచిపోయాయి ఎలాగోలా. ఆ రోజు కొరియర్‌లో ఓ కవర్ వచ్చింది. అవి నా పురస్కార ఆహ్వాన పత్రాలు. గబగబా ఆత్రుతతో ఆహ్వాన పత్రాలు చదివిన నాకు కళ్ళు తిరిగినంత పనైంది. ఎందుకనరేం? ఆ సభకి ముఖ్య అతిథి ఎవరనుకున్నారు? ప్రసిద్ధ కవి, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు డి. నారాయణ స్వామి. ఆయన పేరు తల్చుకుంటేనే కళ్ళు తిరిగినంత పనైంది కదా! మరి ఆయన ప్రక్కన స్టేజిమీద కూర్చోవాలంటే ఇంకెలా ఉంటుందో ఆలోచించండి. అలాంటి సిచ్యుయేషన్‌కి నేను ఎంతో మురిసిపోయాను. నేను మా మిత్రులతో అంటుంటాను చాలా సందర్భాలలో. మనం ఏదో మీటింగ్‌లలో ప్రసిద్ధులతో ప్రక్కన ఫొటోలు దిగటానికి ప్రయత్నిస్తుంటాం గదా, వాళ్ళు మనం ఎవరో తెలియని స్థితులలో ఫొటోలు దిగటం కాదు, మన ప్రతిభను గుర్తించి వాళ్ళే మనకి సత్కారం చేసే గుర్తింపు స్థాయిని మనం కల్పించుకోవాలన్నాను. అది నా విషయంలో నిజం అవుతున్నందుకు ఎంతో ఆనందాన్ని పొందాను. ఆ స్టేజీమీద ఆయనొక్కరే కాదు, ప్రసిద్ధ రచయితలు, సినీ నటులు కూడా పాల్గొంటున్నారు. ఇంకేముంది నాకు మాటలు రాక అలా స్తంభించిపోయాను.

కాసేపటికి తేరుకుని నా మిత్రులందరికి ఫోన్లు చేసి నా ఆనందాన్ని వాళ్ళతో పంచుకున్నాను. నాకు తెల్సిన పత్రికా విలేఖర్ల మిత్రులకీ ఈ విషయాన్ని చెప్పాను.





ఇంకేముంది? మరుసటి పేపర్‌లో "తాటిపాక వెంకటేష్‌కు రమ్యభారతి సాహితీ పురస్కారం" అన్న హెడ్డింగులతో అన్ని పేపర్‌లలో వార్త ప్రచురింపబడింది. ఒకటే ఫోన్లు. నాకు తెలిసినవాళ్ళు, తెలియని వాళ్ళు కూడా ప్రశంసా జల్లులతో తడిపి ముద్దచేశారు.

పురస్కార ప్రదానం చేసే రోజు రానే వచ్చింది. అప్పుచేసి ఎలాగోలా ఆ ఊరికి ప్రయాణమయ్యాను. ఇక వేదిక హాలు దగ్గరకెళ్ళి చూస్తే నన్ను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. నా పేరుతో బ్యానర్లు కట్టి నాకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చే విధంగా మలిచారు అక్కడ సభావేదికను. ఏంటో అదంతా కలలా వుంది. జీవితంలో జరుగుతుందని ఊహించని సంఘటన ఇది. ఒక్కొక్క వ్యక్తిని వేదిక పైకి పిలుస్తున్నారు కార్యక్రమ నిర్వాహకులు. వాళ్ళు స్టేజీ మీదకు వెళ్తుంటే నాకు దడ పుట్టుకొస్తుంది ఆ తర్వాత నన్ను పిలుస్తారు కదా అన్న టెన్షన్‌తో, అది కాక ఒక రోజు నాకు జరిగిన విచిత్ర సంఘటనను తల్చుకుంటే అసలు స్టేజీ ఎక్కాలంటేనే భయమేసింది.

ఆ రోజు నగరంలోని ఓ పోలీసు ఉన్నతాధికారి రిటైర్‌మెంట్ తీసుకొనే రోజు. ఓ సంస్థ వారు ఆయనకి ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటుచేశారు. ఆ వీడ్కోలు సభ చివరిలో నేను వందన సమర్పణ చెప్పవలసి వుంది. సభ చివర్లో సభాధ్యక్షుడు నన్ను వందన సమర్పణ చేయాల్సిందిగా వేదిక మీదకి ఆహ్వానిస్తూ, నా గురించీ, నా సాహిత్య కృషిని గురించి వేదిక మీద గొప్పగా పరిచయం చేశాడు. ఇంకేముంది? అందరూ నా గురించి ఎదురు చూస్తున్నారు.

తీరా నేను వేదికమీదకి వెళ్ళబోతుంటే వేదిక దగ్గరున్న గన్‌మాన్‌లు నన్ను స్టేజి ఎక్కకుండా ఆపారు. "ఎవర్నువ్? స్టేజీ మీదకు రాకూడదంటూ..." ఎందుకంటే వేదిక మీద ఒక పోలీసు ఉన్నతాధికారి ముఖ్య అతిథి సీటులో ఆసీనుడై ఉన్నారన్న మాట. ఇంతకీ వాళ్ళు నన్ను స్టేజి ఎక్కకుండా ఎందుకు ఆపారంటే వందన సమర్పణ చెప్పవలసింది నేను కాదనుకుని, సభాధ్యక్షుడు పరిచయం చేసినదాన్ని బట్టి ఎంతో పెద్ద వ్యక్తి అయ్యి వుంటాడని అందరూ అనుకుంటూ ఉన్నారు. కాని నేనా? గాలివీస్తే ఎగిరిపోయేటట్టు సన్నగా బక్కపల్చగా, చిన్న కుర్రాడిగా ఉంటానాయె.

అదేం గమ్మత్తో తెలియదుగాని నాకు పదమూడేళ్ళ వయస్సులో అందరూ నాకు ఇరవై ఏళ్ళు వుంటాయనుకొనే వారు. కాని నాకిప్పుడు ముప్పై దాటినా పదహారేళ్ళ కుర్రాడిలాగే కనిపిస్తానందరికీ. అది అదృష్టమో దురదృష్టమో తెలియదు గాని ఆ రోజు సభాధ్యక్షులు గన్‌మెన్‌లకు విషయం చెప్పి నన్ను వేదిక మీదకి రప్పించేసరికి నాకు ఉన్న మతి పోయి ఏ విధంగా వందన సమర్పణ చెప్పాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆ వేదికమీదే నాకు తొలిసారిగా ఓ ముద్రపడింది. "పిట్ట కొంచెం కూత ఘనం" అని.

అదే పరిస్థితి ఇప్పుడీ వేదిక మీద నాకు ఎదురైతే? ఊరుకాని ఊరు, వేదిక మీద వున్న పెద్దలెవ్వరూ నాకు తెలిసినవారు కాదు నా గురించి చెప్పటానికి. అలాంటప్పుడు ఆ రోజులాగే ఇక్కడ కూడా నన్నువేదిక నెక్కనీయకుండా చేస్తే నాకెంత అవమానంగా ఉంటుంది? భయమేసి నాకు ముచ్చెమటలు పోశాయి. అయినా లేని ధైర్యాన్ని తెచ్చుకుని అలానే కూర్చున్నాను. సభావేదిక మీదకి నన్ను ఆహ్వానించారు సభాధ్యక్షులు.

అందరి కళ్ళు నాకోసం ఎదురుచూశాయి. నేను ధైర్యంగా వెళ్ళి వేదికమీద సీటులో ఆసీనుడయ్యాను. అయినా నాకు అంత పెద్దవాళ్ళ ముందర కూర్చోవడం ముళ్ళమీద కూర్చున్నట్టే ఫీలవుతూ అప్పుడు చూశాను వేదికమీద, వేదిక క్రింద వున్నవారి ముఖాల్లోకి. అప్పుడు పట్టరాని ఆశ్చర్యాన్ని నేను గమనించాను. కాని వేదికమీద వున్న ప్రముఖ రచయితలు మాత్రం నన్ను గుర్తించారట. ఇంతకుముందు నా ముఖం పత్రికలలో ఫొటోలలో చూడడం వలన, వాళ్ళందరూ నన్ను విష్‌చేసి పరిచయం చేసుకునే సరికి నాలో కొంత ధైర్యం, మరికొంత ఆనందం ఉప్పొంగాయి. ఎందుకంటే అంత పెద్ద రచయితలు వాళ్ళంతట వాళ్ళే నన్ను పరిచయం చేసుకోవటం నాకానందమే కాక ఎంతో అదృష్టం మరి. వేదిక మీద ఒక్కొక్కరు వరుసగా ప్రసంగిస్తున్నారు. అంతలో సభలో కాస్త కలకలం చెలరేగింది. ప్రసిద్ధ కవి, సాంస్కృతిక మండలి అధ్యక్షులు డి. నారాయణ స్వామి మరో మీటింగ్‌కు వెళ్ళాల్సివుంటుందట. త్వరగా తన చేతులమీద సన్మానం జరిపించేస్తే తాను వెళ్ళిపోతాడట. ఇంకేముంది? వక్తల ప్రసంగాలు ఆపి ముందు నాకు సన్మానం చేయడానికి ఉపక్రమించారు.


నాకు సన్మానం చేస్తున్నప్పుడు నారాయణస్వామి గారి చూపులలోకి తొంగిచూశాను. ఆయన చూపుల్లోనూ, చేతల్లోనూ

## 'నిజం'లో మణిచందన

దర్శకుడు తేజా మహేష్‌బాబుతో నిర్మిస్తోన్న చిత్రం 'నిజం'లో ఎన్టీఆర్ నగర్ వంటి సి గ్రేడ్ చిత్రాల్లో నటించిన తెలుగు అమ్మాయి మణిచందన ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదే చిత్రంలో రక్షిత, రాశి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

## పవన్-బాలకృష్ణ చిత్రాల పోటీ

మార్చి 15వ తేదీన బాలకృష్ణ నటించే చిత్రం, పవన్ నటించిన జానీ చిత్రం రెండూ ఒకే రోజున రిలీజ్ అవుతున్నాయి. పవర్‌స్టార్ పవన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు విడుదల అవుతుందోనని పవన్ అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో బాలకృష్ణ కూడా పవన్‌తో పోటీ పడటానికి సిద్ధంగా ఉన్నాడు. అగ్ర కథానాయిక ఆర్తీ అగర్వాల్, సోనాలి బింద్రేలు బాలకృష్ణ సరసన హీరోయిన్లుగా నటిస్తున్నారు. పవన్‌కు హీరోయిన్‌గా రేణుదేశాయ్ నటిస్తోంది.






బెంగుళూరులో ఇటీవల కృషీ విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, హెబ్బల్‌లో జరిగిన 'డాగ్ షో'లో పాల్గొనడానికి తన యజామానితోపాటు వచ్చిన ఓ శునకం

అదొక విధమైన చిన్నచూపు కనిపించింది నాకు. ఎందుకంటే ఇంత చిన్నవయస్సులో నాకు సన్మానం చేస్తున్నారంటే నన్ను కూడా ఆ బాపతుగా జమకట్టారా అని అనిపించింది. ఆ బాపతంటే, హైదరాబాదులో చాలా సంస్థలు అర్హతలేని వ్యక్తులకు కూడా డబ్బు తీసుకుని పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు అతి ఘనంగా చేస్తారట. అదీ కాక నారాయణస్వామి గారు ఏ సంస్థ వారు పిలిచినా సభలకు పరుగెత్తుకుని వెళ్ళిపోతారని ఓ ప్రచారం వుంది. అటువంటి వ్యక్తి తన చేతుల మీద ఎన్ని సన్మానాలు చేశారో! ఎంతమంది అనర్హులకు కూడా సత్కారాలు చేశారో, కాని తనను కూడా ఆ కోవకు చెందినవాడుగా భావించట్లేదు కదా. ఎందుకంటే నాకు మాత్రం ఆ చూపుల్లో, చేతల్లో ఆ 'తేలిక' భావమే కనిపిస్తోంది. ఏది ఏమైతేనేం? జరుగుతున్నది నా మనస్సాక్షికి తెలుసు. ఎవరేమనుకుంటే నాకేంటని ఆ కార్యక్రమ ఆనందంలో లీనమైపోయాను. ఆ రోజు కొత్తవారు, పాతవారు, పెద్దవారు, చిన్నవారు అందరి ప్రశంసలు, పరిచయాలతో ఉక్కిరిబిక్కిరై పోయాను నేను. ఆ ఆనందం మాటల్లో చెప్పలేని వర్ణనాతీతమైనది. అంతటి మధురమైన క్షణాలివి. ఎలాగైతేనేం ఆ రోజు గడిచిపోయింది.

తర్వాత రోజు మా ఊరు వచ్చిన నాకు, ఎక్కడకెళ్ళినా "అవార్డు తీసుకున్నావా? ఎంతిచ్చారు? ఎవరెవరొచ్చారు" అని ప్రశంసలు, అభినందనల పరంపరల మాటలతో బిజీ అయిపోయాను. రోజులు దొర్లుతున్నాయి. కాని నా పురస్కార ప్రభావం మాత్రం నన్ను వెంటాడుతూనే ఉంది. వారం తర్వాత నా బంధువు ఒకరు రోడ్డుమీద బిజీగా వెళ్ళిపోతున్న నన్ను పిలిచి అడిగాడు. "ఏమిటీ! ఈ మధ్య ఏదో అవార్డు తీసుకున్నావటగా. హైదరాబాద్ వెళ్ళొచ్చావా?" అని. ఆయన అన్న మాటలో 'తీసుకున్నావటగా' అనే మాట నన్ను చెళ్ళుమనిపించింది. అందులో కనిపించని ఏదో నిగూఢమైన 'ధ్వని' దాగుని వుంది. ఎందుకలా అనిపించిందంటే గతంలో ఆ బంధువు తాలూకు వ్యక్తి దేశ రాజధాని వెళ్ళి కేంద్రమంత్రి ద్వారా ఓ దివంగతురాలైన దేశ నాయకురాలి పేరు మీద ఇచ్చే అవార్డు అందుకున్నాడు. ఆ అందుకోవడం వెనక ఎన్ని బేరసారాలు జరిగాయో నన్ను పలకరించిన నా బంధువు కూడా స్వయంగా వెళ్ళి చూశాడు కనుక. అలాగని ప్రతి అవార్డు అలాగే కొనుక్కున్నదన్న భావంతో చూడటం తప్పు కదా. మరి ఆ మేనర్స్ అతనికి లేదు. అయినా చెప్పాను ధైర్యంగా 'ఆ పురస్కారం క్రింద నాకు ఎంత సొమ్మిచ్చారో ఆ సొమ్మును అదే వేదిక మీద ఓ రిఫరెన్స్ లైబ్రరీకి డొనేట్ చేశాను' అని. (మీకీ సంగతి తెలుపలేదు కదా! వారు పురస్కారం క్రింద నగదు కూడా ఇచ్చారండోయ్) అలా ఎందుకు చెప్పాల్సొచ్చిందో మీరు గమనించారా? ఆ అవార్డు నేను కొనుక్కోలేదని, వాళ్ళే నాకు తిరిగి డబ్బు ఇచ్చారని అతనికి తెలియచెప్పటం కోసమే. లోనొకటనుకొని పైకి మరోలా మాట్లాడేవారంటే నాకు చాలా చెడ్డ చిరాకు. ఇతనికంటే మా ముసలి మిత్రుడే నయం. మనస్సులో ఉన్నది పైకి కక్కేస్తాడు. "ఏమిటీ! అవార్డు వచ్చిందా? ఎంతిచ్చి కొన్నావేంటి? నాకూ ఒకటి ఇప్పించవా?" అంటూ సూటిగా ఎగతాళి చేసినా నేను అంత బాధపడలేదు. కాని మా బంధువు 'ఇన్‌డైరెక్ట్'గా అన్న మాటే నన్ను బాధించింది.

ఒక్కొక్కరోజు గడుస్తున్నకొద్దీ 'పురస్కార' ప్రభావం నామీద ఒక్కొక్కరకంగా చూపిస్తూ గౌరవం పొందుతున్నానా కించపర్చబడుతున్నానా? అనే భావం నాలో ఏర్పడసాగింది. నాకింకో మిత్రుడున్నాడు. వాడు నా ఎదుట ప్రాణస్నేహితుడి లాగే ప్రవర్తిస్తాడు. కాని వేరే ఎవరి దగ్గరో అన్నాడట. "మన వెంకూగాడు, రమ్యభారతి వారి పుస్తకావిష్కరణ కార్యక్రమం మన ఊర్లో ఘనంగా జరిపించాడు కదా! దానికి లంచంగా వాళ్లు మనవాడికి పురస్కారమిచ్చారు తప్పించి మనవాడిలో సత్తా వుండి కాదు. అయినా మిత్రులందరూ కలిసి చేసిన దానికి, వాడొక్కడే



## అదేం లేదు

నమ్రతా శిరోద్కర్, మహేష్‌బాబుల మధ్య ప్రేమాయణం చాలా జోరుగా సాగుతోందనే వార్తలు ఇటు టాలీవుడ్‌లో, అటు బాలీవుడ్‌లోనూ సంచలనం సృష్టించాయి. ఈ విషయమై నమ్రత వద్ద ప్రస్తావిస్తే, 'ఆ రూమర్స్ విని చాలా బాధపడ్డాను. నేను మహేష్ మంచి ఫ్రెండ్స్ అంతే అంతకుమించి మా మధ్య ఎలాంటి ఎఫైర్ లేదు. కాకపోతే మేము నటించిన సినిమా పూర్తయి పోయినా, ఇంకా అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉంటాము. చిరంజీవిగారితో కూడా నేను క్లోజ్‌గానే ఉంటాను. ఒకసారి చిరంజీవిగారి భార్యతో కలిసి డిన్నర్ చెయ్యడానికి చిరంజీవిగారే స్వయంగా ఆహ్వానిస్తే వాళ్ళింటికి వెళ్ళాను. ఇవన్నీ సినీ ఇండస్ట్రీలో కామన్‌గా జరిగే విషయాలు. ఇలాంటి వాటిని పట్టించుకోవాల్సిన పని లేదు అని సులభంగా కొట్టిపారేసింది.

అవార్డు పొందటం దారుణం" అని. నిజానికి మేమందరం కలిసే కార్యక్రమాలు చేపడతాము. కాని 'అన్నింటిలో నేనే ముందుండి చెయ్యాలి, లేకపోతే ఏ కార్యక్రమమూ ముందుకు సాగదని మా వాళ్ళందరికీ తెలుసు. అయినా మా వాళ్ళలో ఏ బహుమతి వచ్చినా, అవార్డు వచ్చినా రచన ప్రచురితమైన అందరికంటే నేనే ఎక్కువ ఆనందపడేవాడిని. ఆ విషయాన్ని మిగతా మిత్రులందరికీ చెప్పి ఆనందించేవాడిని. ఎవరెవరు పోటీలు పెట్టినా, అవార్డులు పెట్టినా మా వాళ్ళందరిచేతా దరఖాస్తులు పెట్టించి వాళ్ళకి కూడా కొద్దో గొప్పో బహుమతులు వచ్చేలా కృషిచేసిన వాడిని నేను.

అలా ఒకరికొకరం సహకరించుకుంటూ ఎదుగుతున్న మా మధ్య ఇలాంటి కామెంట్స్ చెలరేగటం నా మనస్సుకు చాలా బాధ కలిగించింది. ఆ రోజే నేను ఆ పురస్కారాన్ని తిరస్కరిస్తే బాగుండేదనిపించింది. ఇలాంటివి ఎన్నో పరిణామాలు నేను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి కూడా. నేను పనిచేసే షాపుల ఓనర్లలో నాకు అవార్డు వచ్చినందుకు ఆనందపడ్డవారు కొందరుంటే, మన దగ్గర పనిచేసుకునేవాడు మన కంటే పైకి ఎదగడమేమిటి అన్న ఈర్ష్యతో నా మనస్సును గాయపరిచే మాటలు వెలువరించి బాధపెట్టి ఆనందించేవారూ కొందరున్నారు. మరి కొందరైతే వాడు రాయడం, తిరగడం చేస్తే మన పనులు ఎప్పుడు చేస్తాడసలు? అని ఏవేవో ఊహించుకుంటూ నా జీవనభృతికి దెబ్బగొట్టే విధంగా ప్రవర్తించిన కొందరివల్ల నేను మానసికంగా కృంగిపోయాను.

ఈ అవార్డు నీడ నన్ను ఏ విధంగా వెంటాడుతుందంటే, ఒక రోజు రాత్రి స్కూటర్‌పై వెళుతున్న నేను అనుకోకుండా ట్రాఫిక్‌లో నా స్కూటర్ ఉన్నట్లుండి ఆగిపోయింది. వెనకాల నుండి కార్లు, స్కూటర్ల హారన్ మోతలతో దద్దరిల్లిపోతోంది నా స్కూటర్ ఆగిపోయి ట్రాఫిక్ జామ్ అయిపోయినందుకు. నాకేమో ఏమి జరిగిందో అర్థంకాక కంగార్లో ఉన్నాను. అటువంటి సమయంలో నా ప్రక్కన ఓ స్కూటర్ స్పీడ్‌గా వచ్చి ఆగింది. ఏ పోలీస్ వెహికిలో నా స్కూటర్ అడ్డుగా ఉందని అరవడానికొచ్చాడనుకుని తలెత్తి చూశాను. ప్రక్కన పళ్ళికిలించుకుంటూ దర్శనమిచ్చాడు నా చిన్నప్పుడు నా బట్టలు కుట్టిన టైలర్ వెంకట్రావు. "ఏంటీ? హైద్రాబాద్ నుండి ఎప్పుడొచ్చావ్?" అని అడిగాడు. "హైద్రాబాద్ ఏంటీ?' అర్థంకాక అడిగాను.

"అదే నీకేదో అవార్డొచ్చిందటగా. అది తీసుకుని ఎప్పుడొచ్చావ్?" అడిగాడు వెంకట్రావ్. అంతే! నాకు చిర్రెత్తుకొచ్చింది. ఏ విషయమైనా మాట్లాడటానికి సమయం, సందర్భం ఉండక్కర్లేదా? ఇంత ట్రాఫిక్‌లో నా బండి ఆగిపోయి నేనేడుస్తూంటే ప్రక్కకు తీసేందుకు సహాయపడకపోగా ఇక్కడ కూడా అవార్డు మాటలా? అయినా నేను అవార్డు తీసుకుని నెల దాటిపోయింది. ఆనాటి గుర్తులు మర్చిపోయే పరిస్థితుల్లో ఉన్నాను. అయినా ఆ జ్ఞాపకాలు నీడలా ఇంకా నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. హే భగవాన్! నాకసలు ఈ అవార్డు ఎందుకు వచ్చేలా చేశావ్? చేస్తే చేశావ్! ఈ తిప్పలేంటీ? ఇవన్నీ నేను జీర్ణించుకోలేకపోతున్నాను. డబ్బు ఎదురిచ్చి సన్మానాలు, సత్కారాలు పొందుతున్న ఈ రోజుల్లో వాళ్ళంతట వాళ్ళు వచ్చి ఈ అరుదైన పురస్కారాన్ని నాకు ఇచ్చినందుకు ఆనందపడాలో, దాని వలన ఏర్పడ్డ దుష్పరిణామాలతో మానసికంగా కృంగదీస్తున్నందుకు దుఃఖించాలో అర్థంకాక బుర్ర గోక్కున్నాను. ఈ ఆలోచనలతో ఇంటికి వెళ్ళగానే ట్రింగ్ ట్రింగ్ మని ఫోన్ మోగింది. రిసీవర్ ఎత్తాను. 'హలో'! మేము ఫలానా సంస్థ నుండి మాట్లాడుతున్నామండీ! సాహిత్య కృషికి గుర్తింపుగా మా సంస్థ మీకు అవార్డు ఇవ్వాలని నిర్ణయించాము" అని ఓ ఆడ గొంతు అవతల నుండి చెప్పుకుపోతోంది. అంతే! వామ్మో మళ్ళీ అవార్డా?! వద్దు బాబోయ్! అంటూ గుండె దడతో వణికిపోయాను. ఫోన్ రిసీవర్ నాకు తెలియకుండానే నా చేతిలో నుండి జారి క్రింద పడిపోయింది. ❀

## ఆనందంలో మహేష్

ఆరు చిత్రాలు వరుసగా ఫ్లాప్ అయిన తరువాత 'ఒక్కడు' భారీ హిట్ మహేష్‌బాబుకు కొండంత ఆనందాన్ని ఇచ్చింది. 'మురారి' తరువాత వచ్చిన ఏ చిత్రం మహేష్‌కు ఆశించిన స్థాయిలో హిట్‌ను అందించలేకపోయింది. కానీ ఆ బాధనంతా దూరంగా చేస్తూ, మహేష్‌కు సంక్రాంతి కానుకగా అభిమానులు భారీ విజయాన్ని అందించారు. దీనితో మహేష్ ఆనందంలో మునిగి తేలుతూ తరువాత విడుదలయ్యే 'నిజం' మరోసారి హిట్‌ను అందిస్తుందన్న ఆశతో ఉన్నాడు.

